www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 24 నవంబర్ 2025
5
వైఎస్ఆర్

రేపు పులివెందులకు వై.ఎస్.జగన్

ప్రజాశక్తి -పులివెందుల టౌన్

మాజీ ముఖ్యమంత్రి వైసిపి అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి మంగళ వారం పులివెందులకు రానున్నట్లు వైసిపి నాయకులు పేర్కొన్నారు. మూడు రోజుల పాటు పులివెందులలో ఉండి పలు కార్యక్ర మంలో పాల్గొంటారు. ముఖ్యంగా అరటి ధరలు గణనీయంగా పడిపోవడంతో నియోజకవర్గంలోని అరటి తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడనున్నారు. ఇటీవల వివాహమైన నూతన వధూ వరులను ఆశీర్వదించనున్నారు. ప్రజా దర్బార్ ఏర్పాటు చేసి ప్రజల సమస్యలు తెలుసుకుంటారు. రాబోయే స్థానిక ఎన్నికల దృష్ట్యా నియోజకవర్గం వైసిపి నాయకులతో చర్చిస్తారని తెలుస్తుంది.

ధరలు లేక అరటి రైతులు విలవిల

- పూర్తిగా పతనమైన ధరలు
- టన్ను రూ.6 వేలలోపే
- ఆందోళనలో రైతన్నలు

వనిపెంట వద్ద సాగులో ఉన్న అరటి

ప్రజాశక్తి - చాపాడు

మన ప్రాంత అరటి గతంలో అంతర్జాతీయ మార్కెట్‌లోనూ సత్తా చాటేది. ఎగుమతులు లేకపోవడం, సాగు పెరగడంతో ధరలు పడిపోయాయి. దీంతో అరటి సాగు చేసిన రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎగుమ తులను ప్రోత్సహించడంలో ప్రభుత్వం, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని తెలుస్తుంది. బహిరంగ మార్కెట్లో వ్యాపారులు మాత్రం డజను రూ. 40 నుంచి 50 వరకు అమ్మకాలు చేపడుతున్నారు. రైతుల వద్ద డజను రూ.5కు కూడా కొనుగోలు చేయడం లేదు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన యూనివర్సిటీ కొనుగోలుదారులు, అమ్మకం దారులతో ఒక వేదికను ఏర్పాటు చేసింది. 2023లో రికార్డు స్థాయిలో 35 వేల టన్నుల అరటి పండ్లను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నిర్ణ యంతో అరటి సాగు మరింత పెరిగింది. రాష్ట్రంలో 63.84 లక్షల టన్నుల అరటి పండ్లు ఉత్పత్తి అవుతుండగా ఇందులో ఒక్క వైఎస్ఆర్ కడప జిల్లా నుంచే 23,15,300 టన్నుల దిగుబడి వస్తోంది. పులివెందులలో 20 వేల ఎకరాలు , మైదుకూరులో 13వేల ఎకరాలలో అరటి సాగు అయినది. ఇక్కడి పంటకు అంతర్జాతీయంగా మంచి గుర్తింపు కూడా లభించింది. సాధారణంగా అరటి పండ్లు 6, 7 రోజులు మాత్రమే నిల్వ ఉంటాయి. మన జిల్లాలో సాగు అయ్యే పండ్లు 14 రోజుల వరకు నిల్వ ఉంటున్నాయని రైతులు, వ్యాపారులు పేర్కొంటున్నారు. టిష్యూకల్చర్ వచ్చాక పండ్లలో నాణ్యత పెరిగిందని సూచిస్తున్నారు. కడప జిల్లాలో సాగైయ్యే అరటిలో 80 శాతం చెన్నై, బెంగళూరు నగరాలకు ఎగుమతి అవుతు న్నాయి. రాష్ట్రంలో 1,12,995 హెక్టార్లలో అరటి సాగవు తోంది. ఏటా 63,84,730 టన్నుల అరటి పండ్లు ఉత్పత్తి అవుతున్నాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో అరటి సాగవుతుండగా విస్తీర్ణం, ఉత్పత్తిలో కడప ప్రథమ స్థానంలో ఉంది. కడప జిల్లాలో పులివెందుల, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గంలో అధికంగా అరటి సాగు అవుతుంది. మధ్య ప్రాచ్య దేశాలైన యుఎఇ, బెహ్రాయిన్, ఈజిప్ట్, సౌదీ అరేబియా, ఖతార్, ఇరాన్ దేశాల్లో మన అరటికి మంచి డిమాండ్ ఉండేది. గ్రీన్ కావెండిష్ ప్రీమియమ్ రకాలు ఆ దేశాలకు ఎగుమతి అవు తున్నాయి. 2016-17లో 246 టన్నుల అరటి పండ్లు ఎగుమతి కాగా, 2017-18లో 4,300 టన్నులు, 2018-19లో 18,500 మెట్రిక్ టన్నులకు ఎగుమతులు పెరిగాయి. 2024- 25 కు 30 వేల మెట్రిక్ టన్నులు ఎగుమతి అవుతున్నాయి. ఈ ఏడాది రికార్డు స్థాయిలో 35 వేల మెట్రిక్ టన్నుల అరటి పండ్లను ఎగుమతి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. సాగు విస్తీర్ణాన్ని పెంచడంతోపాటు మార్కెట్‌ను విస్తరించడంలో అధికారులు విఫలమయ్యారని తెలుస్తుంది.

ఇతర రాష్ట్రాలకూ ఆంధ్రా అరటి..

కోస్తా, రాయలసీమలో పండించే అరటి ఇతర రాష్ట్రాలకు సైతం వెళ్తుంది. ఢిల్లీ, రాజస్థాన్, ఒడిశా, బెంగాల్, బిహార్ రాష్ట్రాలకు ఆంధ్రాలో పండించే అరటిని తరలి స్తున్నారు. అక్కడి నుంచి ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేస్తామని అరటి హోల్ సేల్ వ్యాపారులు సూచిస్తున్నారు. కడప జిల్లాలో సాగైయ్యే అరటి మంచి నాణ్యతతో ఉండటంతో దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లో దీనికి బాగా డిమాండ్ ఉంది. మార్కెట్ సీజన్ల వారీగా ఉంటుంది. జులై నుంచి నవంబర్ వరకూ రేటు బాగా పలుకుతుంది. వేసవిలో మార్కెట్ సాధారణంగా ఉంటుంది. విదేశాలకు ఎగుమతిని చేసే అరటికి సాగు దశలోనే జాగ్రత్తలు తీసుకోవాలి. అందుకు తగినట్లుగా ఏపీ రైతులు వ్యవహరిస్తున్నారు. సౌదీ, దుబాయ్ వంటి దేశాలకు అరటి ఎగుమతులు మరింత పెరిగే అవకాశం ఉంటుదని వ్యాపారులు పేర్కొంటున్నారు.

సబ్సిడీలు దక్కడం లేదు..

అరటి సాగు చేసే వారిలో సాధారణ రైతాంగం ఎక్కువగా ఉంటున్నారు. అయితే ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీలు, వివిధ పథకాలు, కోల్డ్ స్టోరేజ్ నిర్మాణాలకు, ఇతర ఎగుమతిదారులకు ఉపయో గపడుతున్నాయే తప్ప సామాన్య రైతులకు పెద్దగా ప్రయోజనం దక్కడం లేదని రైతులు పేర్కొంటున్నారు. పెట్టుబడి ఖర్చులు బాగా పెరిగినట్లు తెలి పారు. అరటి పంట వాతా వరణ మార్పుల మీద ఆధా రపడి ఉంటుందని, గాలుల తీవ్రత ఎక్కువైతే పంట మీద ఆశలు వదు లుకోవాల్సిందే అంటు న్నారు. పంట కాపాడు కోవడానికి కట్టెల సాయం తో మొక్కను నిలబెట్టు కోవాల్సి వస్తుం దని, కానీ కష్టపడి పండిం చిన తర్వాత ధరలు గిట్టు బాటు కావడం లేదని ప్రభు త్వమే పంట కొనుగోలు చేసి ఎగుమతి చేస్తే ఉపయో గంగా ఉంటుందని, సబ్సి డీలు ఇచ్చి, పంటకి మార్కెట్ కల్పిస్తే అరటి ఢోకా ఉండదని అని రైతులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలు ఇలానే కొనసాగితే అరటి సాగు తగ్గుముఖం పడుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.

ధరలు లేక నష్టాలు వస్తున్నాయి

రెండు ఎకరాలలో అరటి తోటను సాగు చేపట్టాను. ప్రారంభంలో టన్ను రూ. 14 వేల వరకు ధరలు పలికాయి. ప్రస్తుతం క్రమేపీ తగ్గుతూ టన్ను రూ. 6వేలకు మాత్రమే వ్యాపారులు అడుగుతున్నారు. సాగు ఖర్చులు గణనీయంగా పెరిగాయి. ఎకరాకు రూ. లక్ష వరకు ఖర్చులు అయ్యాయి. ప్రస్తుతం ఉన్న ధరలకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. ప్రభుత్వం అరటి రైతులను ఆదుకోవాలి.

- వెంకటేశ్వర్లు, అరటి రైతు, వెంకటాపురం.

అరటి రైతులను ఆదుకోవాలి

ఈ ఏడాది రూ. లక్షలు ఖర్చుపెట్టి సాగుచేసిన అరటి పంటకు వల్ల నష్టాలు వస్తున్నాయి. మార్కెట్లో ధరలు లేకపోవడంతో సాగు ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. గతంలో టన్ను రూ. 20 వేల ఉన్న ధరలు ప్రస్తుతం రూ. 5వేలకు చేరుకున్నాయి. కాయలు బాగుంటేనే కొనుగోలు చేపడుతున్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి లేదంటే తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

- తిరుమలయ్య, అరటి రైతు, లింగాలదిన్నె.

తక్కువ ధరలతో తరలిస్తున్న అరటి గెలలు

కార్మిక హక్కులను హరిస్తే సహించం

ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుల హెచ్చరిక

ప్రజాశక్తి - కడప అర్బన్

లేబర్ కోడ్‌ల ప్రతులను దహనం చేస్తున్న యూనియన్ నాయకులు

నాలుగు లేబర్ కోడుల అమలు ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని, కార్మిక హక్కులను హరిస్తే సహించమని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) నగర అధ్యక్షులు సుంకర రవి, జిల్లా ఉపాధ్యక్షులు కంచుపాటి తిరుపాల్ డిమాండ్ చేశారు. ఆదివారం పాత మున్సిపల్ కార్యాలయం ఎదుట జీవో ప్రతులు దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్ల అమలుకై కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ప్రతి సంవత్సరమూ పెట్టుబడిదారుల సదస్సు నిర్వహిస్తున్న కేంద్ర ప్రభుత్వం, కార్మికుల సమస్యలు ప్రస్తావన చేసే లేబర్ కాన్ఫరెన్స్ నిర్వహణ 2015 నుంచి మానేసి తన వర్గ స్వభావాన్ని చూపించుకుందన్నారు. గతంలో 100 మంది పనిచేసే పరిశ్రమల మూసివేతకు ప్రభుత్వ అనుమతి తప్పని సరిగా ఉండే చట్టం స్థానంలో ఇప్పుడు నూతన లేబర్ కోడ్‌లలో 300 మందిలోపు ఉన్న పరిశ్రమలు మూఇ వేసేందుకు చట్టం తీసుకొచ్చి కార్మికుల పోరాటాలను నిరుగార్చేందుకు సహక రిస్తాయని విమర్శించారు. ప్రమాదాల సందర్భంగా ఎంప్లాయర్ అయిన యజమానికి పరిహారం చెల్లించే బాధ్యత నుంచి తీసివేసిందని తెలిపారు. ఆన్‌లైన్ యాప్స్‌లో పనిచేసే గిగ్ వర్కర్స్, కోటి మంది పనిచేసే ప్రభుత్వ స్కీం వర్కర్లను కార్మికుల నిర్వచనం నుంచి లేబర్ కోడ్లు తొలగించాయని చెప్పారు. అన్ని చట్టాలు అమలుచేస్తున్నట్లు యజమాని సొంత పూచీకత్తు ఇస్తే ఎటువంటి చెకింగ్ చేయకుండా చట్టం చేశారని చెప్పారు. 4 లేబర్ కోడ్లు కార్మికుల హక్కుల పాలిట ఉరితాడుగా మరతాయని పేర్కొ న్నారు. నయా బానిసలుగా మారకముందే కార్మికులందరూ ఐక్యంగా బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌ల అమలుకై జారీ చేసిన ఉత్తర్వులను ఉపసం హరించుకోవాలని, లేనిపక్షంలో కార్మిక వర్గం ఏకమై ఉద్యమి ంచాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కంచు పార్టీ శ్రీరామ్, నగర సహా కార్యదర్శి ఇత్తడి ప్రకాష్. రమేష్, హరి చలపతి, రాజు, పెంచలయ్య,సాయమ్మ, చిన్ రెడ్డి, రాజేష్, బాలాజీ, రవి, మోహన్ పాల్గొన్నారు.

వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది భాషోపాధ్యాయులే

పద్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ

నాగఫణి శర్మను సన్మానిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది భాషా ఉపాధ్యా యులేనని పద్మశ్రీ మాడుగుల నాగఫణి శర్మ అన్నారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ, సంస్కృతి సేవాసమితి ఆధ్వర్యంలో ఉమ్మడి కడప జిల్లా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయనమాట్లాడుతూ కడప మమతల గడప, తన ఉనికికి చిరునామా అని తానూ కడప వాసినే అని తెలిపారు. ఇక్కడ రామకృష్ణ జూనియర్ కళాశాలలో అధ్యాప కుడిగా పనిచేశానని పేర్కొన్నారు. అన్నమాచార్యులు, అల్లసాని పెద్దన, పోతన ఈ జిల్లాలోనే జన్మించి తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశారని తెలిపారు. భాష ఉంటేనే మానవుని మనుగడ, సంస్కృతి, ప్రభుత్వం ఉంటుందని చెప్పారు. అటువంటి భాషలపై విద్యార్థులు పట్టు సాధించడం కోసం రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ పదవ తరగతి విద్యార్థులకు తెలుగు, హిందీ భాషాలలో పోటీ పెట్టడం చాలా సంతోషించదగిన విష యమని పేర్కొన్నారు. 'కడపరాయని కడనే పరాయా..'.అంటూ దేవుని కడప వేంకటేశ్వర స్వామి మీద గానం చేసి సభాసదులను సంతోష పరిచారు. ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసుల రెడ్డి మాట్లాడుతూ అవధాని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రావడం చాలా సంతోషించదగిన విషయమన్నారు. అనంతరం నిర్వహించిన పోటీల్లో విజేతలకు అవధాని చేతుల మీదుగా నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డి.కె.చదువులబాబు, డాక్టర్ వరుణ్ కుమార్ రెడ్డి, అంకాల్ కొండయ్య, బోగా గంగాధర్, గుండ్లమడుగు నరసింహ సాయికుమార్, వెంకట ప్రసాద్, సాయి ప్రసాద్, ఇటీవల ఉద్యోగోన్నతి పొందిన ప్రధానోపాధ్యాయులు, డిఎస్‌సి -2003 ఉపాధ్యాయులు, డిఇఒ పూల్ నుంచి ఉద్యోగోన్నతి పొందిన భాషోపాధ్యాయులు, తెలుగు, హిందీ భాషోపాధ్యాయులు, మెగా డిఎస్‌సి -2025 ఉపాధ్యాయులు, ఉమ్మడి కడప జిల్లా పాఠశాలల్లోని విద్యార్థులు 400 మంది పాల్గొన్నారు.

నేటి నుంచి రైతన్నా...మీకోసం

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా ఈ నెల 24 నుంచి రైతన్నా మీకోసం కార్యక్రమం అమలు చేస్తోందని, జిల్లాలో సమర్థ వంతంగా నిర్వహించేందుకు తగు కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖ అధికారులను టెలికాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో పెను మార్పుల ద్వారా సాగును లాభసాటి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలుకార్యక్రమాలను చేపడుతోందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పంచ సూత్రాల ద్వారా రైతులకు మేలు చేసే కార్యక్రమాలపై ఈ నెల 24 నుంచి 29వ తేదీ వరకు ప్రతీ రైతుఇంటికి ప్రజా ప్రతినిధులు, అధికారులు వెళ్లనున్నారని తెలిపారు. డిసెంబర్ 3న రైతు సేవా కేంద్రాల పరిధిలో వర్క్ షాపులు చేపట్టనున్నారని, అన్నదాతలకు మరింత మేలు చేకూర్చేలా పంచ సూత్రాలను, నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు ,అగ్రిటెక్,ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్ధతు అనే అంశాలతో పంచ సూత్రాల విధానాన్ని చేపట్టారని పేర్కొన్నారు. రైతు బజార్లలోనూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను మరింత ప్రమోట్ చేయాలన్నారు.

ప్రజల భద్రతకు 'విజిబుల్ పోలీసింగ్'

ప్రజాశక్తి - కడప అర్బన్ : జిల్లాలో ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పోలీసులు 'విజిబుల్ పోలీసింగ్' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమం ద్వారా పోలీసులు ప్రజలకు మరింత చేరువవుతూ, నేరాలను నియంత్రించడం, రహదారి భద్రతపై అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపడుతున్నారు. అనుమానాస్పద వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. ముఖ్యంగా నిషేధిత వస్తువులు, గంజాయి వంటి వాటి అక్రమ రవాణాను అరికట్టేందుకు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు అవసరమైన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.

సంఘటిత పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం

- దూదేకుల సంఘం రాయలసీమ నాయకులు పి.సిద్ధయ్య, ఖాదర్‌బాషా

ప్రజాశక్తి - రాయచోటి : సంఘటిత పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని దూదేకుల సంఘం రాయలసీమ నాయకులు పగడాల సిద్దయ్య, ఖాదర్‌బాషా హిదాందల్లా పేర్కొన్నారు ఆదివారం రాయచోటి పట్టణం మాసాపేటలోని దూదేకుల సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దూదేకులు సామాజికంగా ఆర్థికంగా రాజకీయంగా రాణించడానికి కృషి చేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార సమయాల్లో పాలక ప్రతిపక్షాలు దూదేకులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు ఇటువంటి మోసపూరిత వైఖరులను ఎదుర్కోవడానికి గ్రామాలు, మండలాల నుంచి జిల్లా కేంద్రాల వరకు కమిటీలను ఏర్పాటు చేసుకొని కార్యక్రమాలను రూపొందించు కోవాల్సిన అవసరం ఉందన్నారు. అప్పుడే విద్య ఉద్యోగ , రాజకీయ అవకాశాలలో హక్కులు దక్కను పడతాయని చెప్పారు. దూదేకుల సంఘం రాష్ట్ర నాయకులు ఖాదర్‌బాషా మాట్లాడుతూ ఎంతో సుదీర్ఘ సుదీర్ఘ పోరాటాలతోనే ఫెడరేషన్ కార్పొరేషన్ వంటి సంస్థల ఏర్పాటు సాధ్యమైందన్నారు. ఇదే తరహాలో రాజకీయ రంగంలో కూడా అలుపెరగని పోరాటం చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కో-ఆప్షన్ వంటి పదవులకు దూదేకులను ఎంపిక చేయాల్సిన అనివార్యతను సృష్టించాలన్నారు. పిల్లల భవిష్యత్తు అవకాశాలను దృష్టిలో ఉంచుకొని పనిచేయాలని పేర్కొన్నారు. దూదేకుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు మన్నూరు అక్బర్ మాట్లాడుతూ డిసెంబర్ 1న రక్తదానం శిబిరాన్ని నిర్వహిస్తున్నామని, దూదేకుల సంఘీయులు హాజరై జయప్రదం చేయాలన్నారు. రక్తదాన ఆవశ్యకత పెరిగిన నేపథ్యంలో సమాజానికి దూదేకుల రక్తాన్ని ఉంచాల్సిన అవసరం ఏర్పడిం దన్నారు. కార్యక్రమంలో దూదేకుల సంఘం నాయకులు ఆయిల్ మిల్ ఓబులేసు, రిటైర్డ్ ప్రిన్సిపల్ మస్తాన్, గగుటూరు నజీర్, మహబూబ్ బాషా, బాదుల్లాతో పాటు రాయలసీమ జిల్లాలకు చెందిన దూదేకుల సంఘం నాయకులు హాజరయ్యారు.

నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూ

- 119 మంది అభ్యర్థులు ఎంపిక

ప్రజాశక్తి కడప అర్బన్ : డిఆర్‌డిఎ- సిడాప్ డైరెక్ట్ ప్లేస్‌మెంట్ ద్వారా జిల్లాలోని నిరుద్యోగ యువతకు మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ - సోలార్ పవర్ ప్రాజెక్టులో వివిధ ఉద్యోగాలకు ఆదివారం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని ది ఇన్‌స్టిట్యూషన్స్ ఆఫ్ ఇంజినీర్స్ భవనంలో ఇంటర్వ్యూ లు నిర్వహించారు. 233 మంది అభ్యర్థులు హాజరయ్యారు. అభ్యర్థులకు మొదటి రౌండ్ ముఖాముఖి నిర్వహించారు. 119 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మెగా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ జిఎం శ్రీనివాసులు, డిప్యూటీ హెచ్‌ఆర్ మేనేజర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఎంపికైన వారికి సోమవారం నుంచి సర్టిఫికెట్ల పరిశీలన, ఫైనల్ రౌండ్ ఇంటర్వ్యూ ఉంటుందని, ఇందులో ఎంపికైన వారికి ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర లో మెగా ఇంజినీరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ ప్రాజెక్టులలో ఉద్యోగం ఇవ్వనున్నారని చెప్పారు. ముఖ్య అతిథిగా హాజరై డిఆర్‌డిఎ పీడీ మాట్లాడుతూ డిఆర్‌డిఎ, సిడాప్ వారు మెగా ఇంజినీర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి కడపలో ప్రత్యేకంగా రిక్రూట్మెంట్ డ్రైవ్ ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఎంఇఐఎల్ వారు నిర్వహించే ఇంటర్వ్యూలో పాల్గొని ఉద్యోగం పొందాలని పేర్కొన్నారు. ఎంపిక కాని వారు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని చెప్పారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ-సిడాప్ జిల్లా జాబ్స్ మేనేజర్ వి.సి. హెచ్ రంగస్వామి, మెగా ఇంజినీర్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కంపెనీ హెచ్‌ఆర్ ప్రతినిధులు, సిడాప్ డైరెక్ట్ ప్లేస్‌మెంట్ ట్రైనర్ పృథ్వీ రాజ్ , పెంచలయ్య, సిడాప్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి - కడప అర్బన్

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జెవివి నాయకులు

జిల్లాలోని ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో ఆదివారం జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జన విజ్ఞాన వేదిక గౌరవ సలహాదారులు కృష్ణారెడ్డి, రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్, ఎస్‌వి ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ సుదర్శన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సంబరాల్లో ప్రభుత్వ పాఠశాలల నుంచి 21 టీములు, ప్రయివేట్ పాఠశాలల నుంచి 16 టీములు పాల్గొని తమ శాస్త్ర ప్రతిభను ప్రదర్శించాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం, మూఢ నమ్మకాల నిర్మూలన, విజ్ఞాన భావజాలాన్ని ప్రజల్లో విస్తరించడం వంటి లక్ష్యాలతో అనేక వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, పరిశోధనాత్మక దృష్టి పెంపుదలకు చెకుముకి వంటి సైన్స్ కార్యక్రమాలను నిరంతరం చేపడుతోందని తెలిపారు. సమాజానికి విజ్ఞానం మరింత చేరువ కావాలనే ధ్యేయంతో పాఠశాలలు, కళాశాలలు, గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్ర మాలు నిర్వహించడం జెవివి ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సమీర్ బాష, శివరాం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పండ్లతోటల పెంపకంపై దృష్టి

- 2026 సంవత్సరానికి ఉపాధి ప్రణాళిక కసరత్తు
- రూ.409 కోట్లతో పనులకు ప్రతిపాదనలు
- డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ఆదిశేషారెడ్డి వెల్లడి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో పడావు, నిరర్థక భూములు కలిగిన యజమానులు పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారించాలి. దీంతో ఆయా కుటుంబాలు ఆర్థిక, సామాజిక స్థిరత్వం లభిస్తుంది, తద్వారా సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని గ్రహించాలి. ప్లాంటేషన్ కార్యక్రమానికి ఉపాధి హామీ చట్టం. సహకారం అందిస్తుంది. సద్వినియోగం చేసుకోవాలి. ఇందులో ఫిట్స్, మొక్కల పంపిణీ, సంరక్షణ అంశాల్లో సహకారం అందిస్తుంది. ఇదిలాఉండగా కడప జిల్లాలో రాబోయే 2026 సంవత్సరంలో ఉపాధి హామీ పనులు చేపట్టడానికి సంబంధించి గ్రామీణ, మండల, జిల్లా స్థాయిల్లో ప్రణాళిక రూపకల్పన జరుగుతోంది. ఈమేరకు రూ. 409 కోట్లతో కూడిన ప్రతిపాదనలు తయారు చేసే ఆలోచనల్లో ఉన్నామని పేర్కొంటున్న డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ బి.ఆదిశేషారెడ్డి పేర్కొన్నారు.

జిల్లాలోని ఉపాధి జాబ్‌కార్డులెన్ని?

జిల్లాలో 2,24,874 జాబ్‌కార్డులున్నాయి. ఇందులో 4,05, 837 మంది కూలీలు ఉన్నారు. ఇందులో 1,84,950 యాక్టివ్ జాబ్ కార్డులున్నాయి. వీటి పరిధిలో 3,08,126 మంది యాక్టివ్ కూలీలున్నారు.

ముఖా ముఖి..

ఉపాధికి హాజరైన కుటుంబాల సంఖ్య?

జిల్లాలో ఇప్పటివరకు 1,34,550 కుటుంబాలు ఉపాధి పనులకు హాజరయ్యాయి. ఇందులో 2,11,585 మంది ఉపాధి హామీ పనులకు హాజరయ్యారు.

ఉపాధి హామీ సరాసరి కూలి ఎంత?

జిల్లాలోని ఉపాధి హామీ కూలీలకు వేతనం రూ.272.77 పడుతోంది. రాష్ట్ర సరాసరి సగటు 267.75 శాతం కంటే అధికంగా పడుతోంది.

2026-27 ఉపాధి హామీ బడ్జెట్ గురించి తెలపండి?

2026-27 ఆర్థిక సంవత్సరంలో 80 లక్షల పని దినాలు కల్పన లక్ష్యం. ఈమేరకు రూ.409 కోట్లతో పనులు చేపట్టాలని అంచనా వేశాం. ఇందులో రూ.164 కోట్లతో కూడిన మెటీరియల్ కాంపొండ్, రూ.245.65 కోట్లు వేజ్ కాంపొండ్ వెరసి రూ.409 కోట్లతో పనులు చేపడతాం.

ప్లాంటేషన్ల పురోగతిపై స్పందించండి?

జిల్లాలో కమలాపురం, బద్వేల్ నియోజకవర్గం వంటి కెనాల్ బెడ్ లేని ప్రాంతాల్లో ప్లాంటేషన్‌లు ఏర్పాటు చేయడానికి అనుకూలం. ఈ మేరకు జిల్లాలో 2,645 ప్లాంటేషన్ల ఏర్పాటుకు ఆమోదం లభించింది. ఈమేరకు 2,231 ప్లాంటేషన్ పనులు పూర్తి చేశాం. మరో 415 ప్లాంటే షన్లు ఈయేడాది డిసెంబర్ చివరి నాటికి పూర్తి చేస్తాం.

క్యాటిల్ షెల్టర్స్ గురించి తెలపండి?

జిల్లాలో1750 క్యాటిల్‌షెల్టర్స్ ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఈమేరకు ఇప్పటి వరకు 1000 క్యాటిల్‌షెడ్స్ పూర్తి చేశాం. ఈ ఏడాది డిసెంబర్ నాటికి మిగిలిన 750 షెడ్లను పూర్తి చేస్తాం. 2026 జనవరిలో వచ్చే సంక్రాంతి పండుగలో ప్రారంభోత్సవాలకు ప్లాన్ చేశాం.

సోషల్ ఆడిట్ వివరాలు తెలపండి?

జిల్లాలో సోషల్ ఆడిట్ ప్రణాళికాబద్ధంగా జరుగుతోంది. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో 19 నుంచి 20 రౌండ్ల మేరకు ఓపెన్ ఫోరం సోషల్‌ఆడిట్ చేపట్టడమైంది. ఇందులోభాగంగా సింహాద్రిపురం, రాజుపాలెం, తొండూరు, మైలవరం, జమ్మలమడుగు, పెద్దముడియం, ప్రొద్దుటూరు, పులివెందుల మండలాల్లో చేపట్టిన సోషల్ ఆడిట్‌లో రూ.14,68,381రికవరీ చేయాలని ప్రతిపాదించాం. ఇందులో రూ.1, 58,508 రికవరీ చేశాం. రూ.13,09,873 రికవరీ మొత్తం రికవరీ చేయాల్సి ఉంది.

ఎమ్మెల్యేపై నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకోం

- టిడిపి నగర అధ్యక్షులు మన్సూర్ అలీఖాన్

ప్రజాశక్తి- కడప అర్బన్

మాట్లాడుతున్న మన్సూర్ అలీఖాన్

వైసిపి నగర అధ్యక్షునిగా ఉన్న అంజాద్‌బాషా తన స్థాయిని మించి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్పు మాధవి, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీనివాసరెడ్డిపై నోరు పారేసుకుంటే చూస్తూ ఊరుకోమని టిడిపి నగర అధ్యక్షులు పఠాన్ మన్సూర్ అలీ ఖాన్ హెచ్చరించారు. ఆదివారం ద్వారకా నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే వద్ద దండుపాళ్యం బ్యాచ్ ఉందని అంజాద్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. నగరంలో ఎవరు దండుపాళ్యం బ్యాచ్‌ను ఏర్పాటు చేశారో ప్రజలందరికీ తెలుసుఅన్నారు. ఈ బ్యాచ్‌తో పేదలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేయడంతో ఘోరంగా ఓడిపోయారని గుర్తు చేశారు. నగరంలో అసాంఘిక కార్యకలాపాలను అడ్డుకునేందుకు సిసి టీవీలు ఏర్పాటు చేసేందుకు ఎమ్మెల్యే మాధవి తన వంతు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అవసరమైతే ఆర్థిక సహాయం చేస్తానని ప్రకటించారన్నారు. కోవిడ్ సమయంలో ఒక్కొక్క కార్పొరేటర్ నుంచి, మిగిలిన వారి వద్ద నుంచి ఎంత డబ్బులు వసూలు చేశారో, ఆ డబ్బు ఎక్కడ ఉందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పై వ్యాఖ్యలు చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని పేర్కొన్నారు. సమావేశంలో రెండు డివిజన్ కార్పొరేటర్ సుబ్బారెడ్డి, నాయకులు సుబ్బరాయుడు, చిన్న బాబు, శిలాస్ పాల్గొన్నారు.

దౌర్జన్యాలు, భూ కబ్జాలు వైసిపి నాయకులకే చెల్లు

ప్రజాశక్తి - కడప అర్బన్ : దౌర్జన్యాలు, భూ కబ్జాలు చేయడం వైసిపి నాయకులకే చెల్లిందని టిడిపి బిసి నాయకులు సుబ్బరాయుడు యాదవ్ అన్నారు. ఆదివారం ద్వారకా నగర్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అన్యాయం జరిగితే 2000 మందితో వస్తానంటూ మాజీ డిప్యూటీ సిఎం వ్యాఖ్యానించడం హాస్యాస్పదమన్నారు. వైసిపి పాలనలోనే వారి కార్యకర్తలకు అన్యాయం చేశారని పేర్కొన్నారు. ప్రజల ఛీదరించుకుని ఓడించారని తెలిపారు. పనులు కార్యకర్తలకు ఇస్తూ వారి దగ్గర 8 శాతం పర్సెంటేజీ తీసుకున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస రెడ్డి గురించి మాట్లాడే హక్కు వారికి లేదన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి, నాయకులు

విభజన హామీలు అమలు చేయని కేంద్రం

ప్రజాశక్తి - ఖాజీపేట

ఆంధ్రప్రదేశ్ విభజన సమయంలో ఇచ్చిన హామీలను కేంద్ర ప్రభుత్వం అమలు చేయలేదని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి తెలిపారు. స్థానికంగా ఆదివారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంలోని మోడీ సర్కార్ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. విభజన హామీ చట్టం ప్రకారం రాయలసీమకు ప్రత్యేక నిధులు, ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ఇంతవరకు జరగనేలేదని తీవ్రంగా విమర్శించారు. అప్పుల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆస్కార్ అవార్డు ఇవ్వవచ్చని తెలిపారు. బెల్ట్ షాపులు విచ్చలవిడితనం ఎక్కువైందన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా రైతులను, ప్రజలను ఆదుకోవడానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం మాజీ మంత్రి రవీంద్రారెడ్డిని ఆయన నివాసంలో కలిసి రాజకీయం విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఫయాజ్, ఎస్సీ సెల్ మండల శాఖ అధ్యక్షుడు రమణ, నాయకులు ఇస్మాయిల్, ఖలీల్, జిలాని, అమర్నాథ్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

పూల బక్షును పరామర్శిస్తున్న ఎస్.రామమునిరెడ్డి, నాయకులు

టిడిపి మైనార్టీ నాయకుడికి పరామర్శ

ప్రజాశక్తి - వేంపల్లె

ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవాలని టిడిపి మండల కన్వీనర్ ఎస్.రామమునిరెడ్డి సూచించారు. స్థానిక గాంధీ రోడ్డులో నివాసం ఉంటున్న టిడిపి సీనియర్ మైనార్టీ నాయకుడు పూల బక్షును ఆదివారం ఆయన పరామర్శించారు. పూల బక్షు ఇటీవల తన మోకాళ్లకు ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రామమునిరెడ్డితోపాటు టిడిపి నాయకులు జబిబుల్లా, బాలకిష్టారెడ్డి, వీరభద్ర, మహమ్మద్, జనసేన నేత పోతిరెడ్డి చలపతి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య విషయాలపై పూల బక్షును అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని వారు కోరారు.

బ్రాహ్మణులను కించపరిచే వారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

బ్రహ్మణులను కించపరిచే వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరి ప్రసాదరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. డప్పు చంద్రయ్య వర్ధంతి సందర్భంగా గాయకుడు రమణ బ్రాహ్మణులను కించపరుస్తూ పాటలు పాడడం మంచి పద్ధతి కాదన్నారు. బ్రహ్మణులను కించ పరుస్తూ పాట పాడిన గాయకుడు రమణ, ఆయన బృందంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వర్ధంతి కార్యక్రమాలు జరుపుకోవడంలో తప్పులేదన్నారు. ఇతర వర్గాలను కించపరచడం, సమాజ శ్రేయస్సు కోరే బ్రాహ్మణులను విమర్శించడం దారుణమన్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టే రమణ లాంటి వ్యక్తులు సమాజంలో ఉండే అర్హత లేదన్నారు. ప్రజలను జాగృతం చేసే శక్తి పాటలను పాడాలని ఆయన సూచించారు. పాటలు పాడే వారు అందరిని సమన్వయం చేసుకొని పోవాలని కోరారు.

చెక్కు అందజేస్తున్న నాగబాబు, నాయకులు

హుస్సేన్ కుటుంబానికి జనసేన ఆర్థికసాయం

ప్రజాశక్తి - దువ్వూరు

మండలంలోని జిల్లెళ్ల గ్రామానికి చెందిన దూదేకుల హుస్సేన్ బాషా కుటుంబానికి జనసేన పార్టీ తరపున రూ.5లక్షలు ఆర్థికసాయం అందిస్తున్నట్లు మైదుకూరు నియోజకవర్గం జనసేన నాయకులు పాశం లక్ష్మీ నరసయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం తాడేపల్లి అన్నపూర్ణ కన్వెన్షన్ హాల్‌లో జనసేన ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు చేతులమీదుగా అందజేశారు. హుస్సేన్ ప్రమాదవశాత్తూ చనిపోయాడు. ఆ కుటుంబానికి చెక్కు అందజేసినట్లు తెలిపారు. దూదేకుల హుస్సేన్ బాషా జనసేన కార్యకర్తగా పార్టీ సభ్యత్వం తీసుకున్నందున, ఆయన ఆకస్మిక మరణం వల్ల జనసేన పార్టీ తరపున ఆర్థిక సాయంగా వారి కుటుంబానికి ఆర్థికసాయం చేసిందన్నారు. హుస్సేన్ బాషా తల్లి ఓబులమ్మ మాట్లాడుతూ మా కుటుంబానికి జనసేన పార్టీ తరపున ఆర్థిక సాయం అందించిన పవన్‌కల్యాణ్ రుణం తెచ్చుకోలేనిదన్నారు. పార్టీకి ఎప్పుడూ మా మద్దతు ఉంటుందన్నారు. ఇందుకు కృషి చేసిన మైదుకూరు నియోజక వర్గం నాయకులు పాశం లక్ష్మీ నరసయ్యకు ఆమె ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తాతంశెట్టి నాగేంద్ర, దీటి హరిక్రిష్ణ, పలువురు రాష్ట్ర నాయకులు, జనసేన మంగళగిరి పార్టీ ఆఫీస్ సభ్యులు పాల్గొన్నారు.

అందరికీ సేవ చేయాలనే మార్గాన్ని అనుసరించాలి : కలెక్టర్

ఘనంగా శ్రీసత్య సాయిబాబా శత జయంతి వేడుకలు

ప్రజాశక్తి - కడప

అందరిని ప్రేమించాలి, అందరికీ సేవ చేయాలి అనే మార్గాన్ని అనుసరించేలా శ్రీ సత్యసాయి బాబా ప్రేరణ ఇచ్చారని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాల్లో శ్రీ సత్య సాయి బాబా శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డిఆర్ఓ విశ్వేశ్వరనాయుడు హాజరయ్యారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సత్యసాయిబాబా జయంతి వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. 1950 ఆశ్రమం స్థాపించినప్పుడు అనంతపురం జిల్లా వెనుకబడిన కరువు జిల్లాగా ఉండేదని, ఆశ్రమం స్థాపించిన తర్వాత ఆ ప్రాంత ప్రజలకు వైద్యం, విద్య, తాగునీరును ఆశ్రమం ద్వారా అందించారని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి విద్యను ఒక రూపాయి ఖర్చు లేకుండా అందించారని తెలిపారు. ఉన్నత స్థాయి వైద్య పరికరాలతో ప్రజలకు వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. జెసి మాట్లాడుతూ శ్రీసత్యసాయిబాబా అనుసరించిన సేవా గుణాన్ని అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు. **కడప అర్బన్ :** ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎఆర్ అదనపు ఎస్‌పి బి.రమణయ్య శ్రీ సత్య సాయి బాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ లు వెంకటేశ్వర్లు, రామస్వామిరాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చినుకుపడితే చిత్తడే

- విద్యుత్ కార్యాలయాల వద్ద మురుగునీరు
- ప్రమాదకరంగా పురాతన కాలంనాటి భవనాలు
- ప్రాంగణమంతా దుర్గంధం

విద్యుత్ కార్యాలయంలో మురుగునీరు

ప్రజాశక్తి-ఎర్రగుంట్ల

స్థానిక వేంపల్లి రోడ్డులోని ఎపిఎస్‌పిడిఎసిఎల్ కార్యాలయాల్లో చిన్నపాటి వర్షం పడితే ఆవరణమంతా బురదమయంగా మారుతోంది. వర్షపు నీటితో పాటు, డ్రైయినేజీ కాలువలోని మురుగునీరంతా కార్యాలయాల ప్రాంగణంలోకి ప్రవేశిస్తోంది. అర్బన్ ఎఇ కార్యాలయం పక్కన చేరిన మురుగునీరు కుంటను తలపిస్తోంది. వర్షపు నీటితో పాటు డ్రైయినేజీ నీరుచేరి నిల్వ ఉండిపోతుంది. మురుగు నీటి వల్ల దుర్గంధం వెదజల్లుతుంది. ముఖ్యంగా కార్యాలయాల వద్ద నిల్వ ఉన్న మురుగు నీటితో దుర్గంధం, దోమల బెడద ఎక్కువగా ఉండటం వల్ల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్థానికంగా సబ్ డివిజన్ కార్యాలయం, ఇఆర్ఓ కార్యాలయం, ఏడీ కార్యాలయం, ఏఈ అర్బన్, రూరల్ కార్యాలయాలున్నాయి. వివిధ పనుల నిమిత్తం కార్యాలయాలకు వచ్చే వినియోగదారులతోపాటు ఉద్యోగులు బురదతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 70 ఏళ్ల కిందట నిర్మించిన పెంకుల కప్పు వేసిన కార్యాలయాలు, పురాతన కాలం నాటి కార్యాలయాలు అవ్వడం వలన్లచాలా ప్రమాదకరంగా ఉన్నాయి. కార్యాలయాల పైకప్పు ఉరుస్తుండడంతో ప్లాస్టిక్ పట్టలు కప్పించారు. పైకప్పులు ఎప్పుడు మీద పడతాయో అన్నట్లుగా ప్రమాదకరంగా ఉన్నాయి. ఉద్యోగులు బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయాల ప్రాంగణమంతా అపరిశుభ్రంగా ఉండటం వల్ల దుర్వాసన వస్తోంది. గత నెలలో నీట మునిగిన కార్యాలయాలను విద్యుత్ ఎస్ఇ పర్యవేక్షించారు. ప్రాంగణంలోని నూతన ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు ఇతర వస్తువులూ నీట మునిగితేలుతున్నాయి. ఈ క్రమంలో నూతన కార్యాలయానికి ఎస్ఇ ఆధ్వర్యంలో ప్రతిపాదనలు పంపించినట్లు స్థానిక ఉద్యోగులు చెబుతున్నారు.

వర్షానికి ఉరుస్తున్న విద్యుత్ కార్యాలయం

వర్షమొస్తే ఇబ్బంది పడుతున్నాం

ప్రస్తుతం కురుస్తున్న అధిక వర్షాల వల్ల స్థానిక కార్యాలయాల ప్రాంగణంలోకి నీరు చేరుతుంది. గతంలో నిర్మించిన కార్యాలయాలు అవడం వల్ల ఉరుస్తున్నాయి. వర్షం వస్తే కార్యాలయాల్లోకి కూడా నీరు వచ్చి చేరుతుంది. నూతన కార్యాలయాలకు ఉన్నతాధికారులకు పంపాం. నూతన ట్రాన్స్‌ఫార్మర్లు నీట మునిగినా షీల్డ్ అయినందున ఎలాంటి నష్టం ఉండదు.

- రూరల్ ఏఈ చంద్రశేఖర్

మాంసం దుకాణాలపై దాడులు

నాణ్యతలేని మాంసం కాల్చివేత.. కల్తీ మాంసం విక్రయిస్తే చర్యలు : కార్యదర్శి

ప్రజాశక్తి - వేంపల్లె

పంచాయతీ అధికారులు ఆదివారం మాంస విక్రయ దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి వేమిరెడ్డి నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యకరమైన మాంసాన్ని ప్రజలకు విక్రయించాలని దుకాణాదారులను ఆదేశించారు. నాణ్యతలేని మాంసాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రజల ఫిర్యాదుల మేరకు ఆది వారం తెల్లవారు జామున వేంపల్లెలోని ఆయా ప్రాంతాలతోపాటు గాంధీ రోడ్డులో ఉన్న కటిక దుకాణాలపై పంచాయతీ సిబ్బందితో కార్యదర్శి నాగభూషణం ఆకస్మిక దాడులు చేశారు. చనిపోయిన 8 గొర్రెల ఫ్రీజ్‌లో నిల్వ ఉంచిన మాంసాన్ని కల్తీ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఆ మాంసాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనారోగ్యంగా ఉన్న గొర్రెల 80కిలోల మాంసాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. దీన్ని ఆయా కటిక దుకాణాల వద్దనే పెట్రోలు పోసి కాల్చారు. అధికారులు అప్పుడప్పుడు ఇలా దాడులు చేసి ప్రజలకు నాణ్యమైన మాంసాన్ని విక్రయించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహమతుల్లా కోరారు. ధరలు కూడా అదుపులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కిలో రూ.800 పెట్టి ఫ్రీజ్‌లో పెట్టిన, చనిపోయిన, అనారోగ్యకర గొర్రెల మాంసం తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉందని ప్రజలు కార్యదర్శి ముందు ఆవేదన వ్యక్తం చేశారు. దాడులు చేయడంతో కల్తీ విషయం ప్రత్యక్షంగా బయట పడిందని తెలిపారు. కార్యదర్శి నాగభూషణంరెడ్డి మాంసం దుకాణాలపై దాడులు హర్షణీయమని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ కల్తీ మాంసం వల్ల ప్రజలు రోగాల బారిన పడుతారని తెలిపారు. మొదటి సారిగా జరిమానా వేయకుండా విడిచిపెడుతున్నామన్నారు. ఇలాగే కొనసాగితే కేసులు, జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. చికెన్ పకోడ దుకాణాల యాజమానులపై కూడా ఫ్రీజ్‌లో ఉంచి విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు వచ్చాయని, వారు తమ పద్ధతులను మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహమతుల్లా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్రీజ్‌లో పెట్టి విక్రయిస్తున్న కల్తీ మాంసం

అమ్మకానికి సిద్ధం చేసిన అనారోగ్యంగా ఉన్న గొర్రె మాంసం, హెచ్చరిస్తున్న ఇఒ

అత్యవసర సమయాల్లో ఆయుధం శక్తి యాప్

పోస్టర్లు ఆవిష్కరిస్తున్న డిఎస్‌పి, పోలీసులు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

అత్యవసర సమయంలో మహిళలకు శక్తి యాప్ ఆయుధంలా పనిచేస్తుందని మైదుకూరు డిఎస్‌పి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మహిళల భద్రత కోసం శక్తి యాప్ ప్రత్యేకంగా రూపొందించబడిందన్నారు. ఆ మేరకు ఆదివారం యాన మైదుకూరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ ప్రతి మహిళ శక్తి యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఈ యాప్ డౌన్లోడ్ చేసుకున్న వారి ఫోన్ నెంబర్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం అవుతుందన్నారు. ప్రమాదం, అత్యవసర సమయంలో కానీ ఐదు సార్లు మొబైల్‌ను షేక్ చేస్తే ప్రమాదంలో ఉన్నట్లు గుర్తించి కంట్రోల్ రూమ్‌కు అలర్ట్ వస్తుందన్నారు. దగ్గరలోని పోలీసులు ఐదు నిమిషాల సమయంలో బాధిత మహిళ వద్దకు వెళ్లి సహాయం చేస్తారన్నారన్నారు. ఈ యాప్ ద్వారా ఇంట్లో నుంచి కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. రాత్రి వేళల్లో, ఇతర ప్రాంతాలకు వెళ్లినప్పుడు బై షెల్టర్ బటన్ నొక్కితే దగ్గర్లోని సురక్షిత ప్రాంతంలోని హోంను చూపిస్తాయన్నారు. కార్యక్రమంలో మైదుకూరు అర్బన్ సీఐ రమణారెడ్డి, ఎస్ఐ చిరంజీవి, సుబ్బారావు, పోలీసులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటా : పిఆర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

వైసిపి కార్యకర్తలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, వారికి అండగా ఉంటానని ఆ పార్టీ జమ్మలమడుగు నియోజకవర్గ సమన్వయకర్త పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి (పిఆర్) పేర్కొన్నారు. జమ్మలమడుగులోని తన కార్యాలయంలో ఆదివారం కొండాపురం మండలానికి చెందిన గం డ్లూరు నారాయణరెడ్డి, చింత రాజ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు వెళ్లి సమన్వయకర్త బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పిఆర్ మాట్లాడుతూ కష్టకాలంలో పార్టీ అభ్యున్నతికి కష్టపడిన వారిని తప్పక గుర్తిస్తామన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తప్పకుండా వైసిపి అధికారంలోకి వస్తుందన్నారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఎలాంటి బెదిరింపులకు భయపడకుండా పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శ్రీరంగనాథరెడ్డి, నవ జ్యోతిష్‌రెడ్డి, అనంతపురం రామకృష్ణారెడ్డి, జెడ్పిటిసి సభ్యుడు శేఖర్, గంగాధర్, మంజుల చౌడప్ప, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

పిఆర్‌ను కలిసిన కొండాపురం వైసిపి నాయకులు

బహుమతి అందుకుంటున్న అభినయశ్రీ

ప్రతిభ పరీక్ష పోటీలో అభినయశ్రీకి రెండవ స్థానం

సింహాద్రిపురం : ప్రతిభ పరీక్ష పోటీలో సింహాద్రిపురం జడ్‌పి హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి అభినయశ్రీ రెండవ స్థానం సాధించినట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సతీష్‌కుమార్ తెలిపారు. ఆదివారం కడపలో రాష్ట్రభాషోపాధ్యాయ సంస్థ నిర్వహించిన ఈ పోటీల్లో రూ3,500 నగదు బహుమతి సాధించిందన్నారు. బహు మతులను భాషోపాధ్యాయ సహస్ర అవధాని మాడుగుల నాగఫణి శర్మ అందజేశారన్నారు. ఈ సందర్భంగా అభినయశ్రీని ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం..పట్టని అధికారులు

ప్రభుత్వ స్థలం కోసం జరుగుతున్న ఘర్షణ

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని సురభి గ్రామం నాగలగట్టుపల్లె ప్రాథమిక ఆస్పత్రి ముందు భాగంలో ఉన్న వేంపల్లి-రాయచోటి ప్రధాన రహదారిలోని ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జాకు యత్నిస్తున్నారు. మరికొందరు రూ.లక్షల్లో అగ్రిమెంట్ల మీద చేతులు మారుతున్నాయి. రోడ్డు విస్తరణలో భాగంగా ఆస్పత్రి ప్రహరీ కొట్టేసి సైడ్ కాలువ తీశారు. ఈ నేపథ్యంలో కొందరు ఎన్నో ఏళ్లుగా ఇక్కడ వ్యాపారం చేసుకుంటున్నామని దుకాణాలు పెట్టుకోవడం, మరికొందరు ఆక్రమించిన స్థలాన్ని ఇంకొకరికి విక్రయించి, అగ్రిమెంట్ చేసుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. ఈ పరిస్థితుల్లో వారి మధ్యనే నా స్థలం.. నా స్థలం అంటూ ఘర్షణ వాతావరణం నెలకొంటోంది. ప్రభుత్వ స్థలాన్ని ఎలా కొంటావంటూ వాదనలు జరుగుతున్నాయి. ప్రభుత్వ స్థలాన్ని ఎలా అమ్ముతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ స్థలంలో చిన్న వ్యాపారాలు పెట్టుకోవడమే కాకుండా ఆటోలు. స్కూటర్లు ఆస్పత్రికి వెళ్లే దారిలో అడ్డంగా పెడుతున్నారు. రోగులు ఆస్పత్రికి వెళ్లాలంటే ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైద్యాధికారి శివప్రసాద్‌ను వివరణ కోరగా.. ఈ విషయమై తాను గతంలో ఉన్న ఎస్ఐ దృష్టికి తీసుకెళ్లానని, ప్రస్తుతం ఎంపిడిఒకు కూడా తెలిపానని అన్నారు. రోడ్డు నవరణలో ప్రహరీ పోయిందని, ప్రహరీ కట్టిస్తామని, ఆ తర్వాత చూస్తామని సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పినట్లు వైద్య అధికారి శివప్రసాద్ వివరించారు.

బాల నారాయణను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల చేయూత

ప్రజాశక్తి - చక్రాయపేట

చక్రాయపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు తమ పాఠశాలకు ఆర్థిక చేయూతనిచ్చారు. 1985-86 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఆదివారం కలిశారు. వీరంతా తమతమ వృత్తుల్లో వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఈ సందర్భంగా వారు తమ గురువులను, అప్పటి తెలుగు ఉపాధ్యాయుడు బాల నారాయణను ఘనంగా సత్కరించి పాదాభివందనం చేసుకున్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రను సన్మానించారు. పాఠశాలకు తమ వంతుగా పూర్వ విద్యార్థులు రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. మధ్యాహ్నం విందు కార్యక్రమం ఏర్పాటు చేసుకొని కలిసి భోజనం చేశారు.

మాట్లాడుతున్న మైదుకూరు నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఆది శేషారెడ్డి

ప్రతి రైతు కుటుంబాన్నీ కలవాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు నియోజకవర్గ పరిధిలో ప్రతి ఒక్క రైతు కుటుంబాన్నీ సిబ్బంది కలవాలని నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆదిశేషారెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిశేషారెడ్డి మాట్లాడుతూ సోమవారం నుండి 29వ తేదీ వరకు రైతన్న మీకోసం పథకంలో భాగంగా ప్రతి ఒక్కరిని నేరుగా కలవాలన్నారు. ఎవరికైనా అర్హత ఉండి పథకం అందకపోతే వారి నుంచి అర్జీలు స్వీకరించాలన్నారు. ప్రతిరోజు ఏర్పాటు చేసిన షెడ్యూల్ ప్రకారం వ్యవసాయ సిబ్బంది, పశువైద్య సిబ్బంది, ఇతర అధికారులు రైతులను కలవాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజసింహ నరేంద్ర, ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు, ఏఓ బాల గంగాధర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. **చాపాడులో..** రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతునూ కలవాలని మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి తెలిపారు. ఆదివారం మండల సభా భవనంలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో కార్యాలయ అధికారి రామానుజం, వ్యవసాయ అధికారి దేవి పద్మలత, డిటి కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ గురుమూర్తి రెడ్డి తెలిపారు. కమిషనర్ యువజన సర్వీసుల శాఖ విజయవాడ వారి ఆదేశాల మేరకు శని వారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వ్యక్తిత్వ వికాసం, కెరీర్ కౌన్సెలింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం అంటే ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడమన్నారు. యువత చదువు, కళలు, క్రీడల పట్ల ఏకాగ్రత కలిగి ఉండాలన్నారు. స్టెప్ ఇన్‌ఛార్జి ముఖ్య కార్యనిర్వహణాధికారి వివి సుబ్బారాయుడు మాట్లాడుతూ దేశ జనాభాలో యువత 33శాతం ఉందన్నారు. ప్రపంచంలో ఏ ఇతర దేశంలో యువత ఇంత శాతం లేదన్నారు. యువజన సర్వీసుల శాఖ స్టెప్ ద్వారా యువతకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన ఉరుసు

ప్రజాశక్తి - వేంపల్లె

బిడ్డాల మిట్టలోని పాపాగ్ని నది ఒడ్డున వెలిసిన హజ్రత్ జిందేషా మదార్ షావలి ఉరుసు ఆదివారం ఘనంగా ముగిసింది. రెండు రోజులపాటు జిందేషా మదార్ షావలి ఉరుసును దర్గా కమిటీ సభ్యులు నిర్వహించారు. శనివారం రాత్రి జరిగిన జిందేషా మదార్ షావలి ఉరుసు మహోత్సవంలో ఖవ్వాలీ పోటీలు తాబ్ రేజ్ ఖాదిరీ, తాహసీనా తాజ్ మధ్య రసవంతంగా, పోటాపోటీగా జరిగాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిఐ నర్సింహులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి, మండల కన్వీనర్ రామమునిరెడ్డి, ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, బాలకృష్ణారెడ్డి, మైనార్టీ మండల కన్వీనర్ తెలంగాణ వలిని దర్గా కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు పీరా సాహెబ్, ఫయాజ్ బాషా, చాంద్ బాషా, మదార్ పాల్గొన్నారు.

టిడిపి నేతలను సత్కరించిన దర్గా కమిటీ సభ్యులు